క్లుప్తంగా

కుప్పి పాఠశాల సందర్శన



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో నరేందర్

సాక్షి స్పందన

తానూరు: మండలంలోని వడ్గాం పంచాయతీ పరిధి కుప్పి గ్రామంలో ప్రాథమిక పాఠశాల మరాఠీ మీడియంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నారనే సాకుతో 9 ఏళ్ల క్రితం మూతపడింది. దీంతో విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసిస్తుండగా, మరికొందరు చదువుకు దూరమవుతున్నారని, ఈ తీరు గురించి 'సారూ..బడిని తెరిపించండి'శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎంఈవో నరేందర్ స్పందించారు. ఆయన, ఉపాధ్యాయులు ఆ పాఠశాలను సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య ఉంటే పాఠశాలను తెరిపించేలా చూస్తామన్నారు. గ్రామంలో గ్రామసభ నిర్వహించి విద్యార్థులకు స్థానిక పాఠశాలలో చేర్పించేలా చూస్తామని గ్రామస్తులు వారికి విన్నవించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాబుమియాకు చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నర్సాపూర్(జి)/లోకేశ్వరం/కుంటాల: నర్సాపూర్(జి) మండలం చాక్‌పల్లి గ్రామానికి చెందిన బాబుమియాకు రూ.30వేలు, లోకేశ్వరం మండలం రాజూరకు చెందిన గాయత్రికి రూ.రూ.31500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సోమవారం అందజేశారు. నాయకుడు ఖదీర్ ఉన్నారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆదేశాలతో కుంటాలకు చెందిన గంగవ్వకు రూ.27 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. మాజీ ఎంపీపీ గజ్జారాం యాదవ్, చిన్నన్‌రావు, గోవర్ధన్, గజేందర్, మునీశ్వర్ రాజు ఉన్నారు.

బాలకార్మికుల నిర్మూలన చట్టంపై అవగాహన

భైంసాటౌన్:పట్టణంలోని గాంధీగంజ్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలకార్మికుల నిర్మూలన చట్టంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో రాజశ్రీ మాట్లాడుతూ బాల కార్మిక చట్టం, ప్రాధాన్యత, తదితర అంశాల గురించి వివరించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రజల్లో చైతన్యం కోసమే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. సూపర్‌వైజర్ కవిత, జూనియర్ అసిస్టెంట్ స్వాతి, కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ నవీన్ పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

కుంటాల: కుంటాల సహకారసంఘ భవనంలో ఆర్ఎఫ్ సీఎల్ రకం 450 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, సీఈవో నాగభూషణం ఓ ప్రకటనలో తెలిపారు. కావల్సిన రైతులు ఆధార్, పట్టాపాస్ పుస్తకం జిరాక్స్‌తో వచ్చి యూరియా తీసుకెళ్లాలని సూచించారు.

పంపిణీకి జీలుగు విత్తనాలు సిద్ధం..

సహకార సంఘ భవనంలో జీలుగు విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, సీఈవో నాగభూషణం తెలిపారు. 25 కిలోల బస్తా ధర రూ.2,137.50 కాగా, ప్రస్తుతం 166 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావల్సిన రైతులు వ్యవసాయ కార్యాలయంలో టోకెన్ తీసుకుని విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు.

కావాలి అగ్రికల్చర్ పాలిటెక్నిక్

- ముధోల్ పరిశోధన కేంద్రంలో 45 ఎకరాల స్థలం
- కళాశాలతో విద్యార్థులకు, రైతులకు మేలు



ముధోల్‌లోని వ్యవసాయ పరిశోధన స్థానం

భైంసా: ముధోల్‌లో 45 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వ్యవసాయ పరిశోధన కేంద్రం రైతులకు విలువైన సేవలు అందిస్తోంది. ఇక్కడి వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటల సాగు, చీడపీడల నివారణ, అధిక దిగుబడి సాధనకు సంబంధించిన పరిశోధనలు చేస్తున్నారు. విత్తనశుద్ధి కేంద్రం కూడా ఇక్కడ ఉండడంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుతున్నాయి. శాస్త్రవేత్తలు జిల్లా వ్యాప్తంగా సలహాలు, సూచనలు అందిస్తూ, మారుమూల గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. అయితే, గత 50 ఏళ్లుగా ఈ కేంద్రం ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతోంది. తగిన సంఖ్యలో శాస్త్రవేత్తల నియామకం లేక, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయకపోవడం వల్ల కేంద్రం నామమాత్రంగా నడుస్తోంది.

వ్యవసాయంతో జిల్లా జీవనాడి

జిల్లాలో వ్యవసాయ భూములు విస్తృతంగా ఉన్నాయి. ప్రతీ కుటుంబం దాదాపు వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. ఇక్కడి విద్యార్థులు హైస్కూల్ స్థాయి నుంచే వ్యవసాయపనుల్లో పాల్గొంటారు. సెలవు రోజుల్లో, ఉదయం, సాయంత్రం సమయాల్లో వారు తమ పొలాల్లో పనిచేస్తూ కనిపిస్తారు. అయినా వ్యవసాయ విద్యపై ఆసక్తి చూపడం లేదు. రైతులు పంటల సంరక్షణ, విత్తన ఎంపిక విషయంలో ప్రైవేటు వ్యాపారుల సలహాలపై ఆధారపడుతున్నారు, ఇది శాస్త్రీయ విధానాలకు దూరం చేస్తోంది.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల..

జిల్లాలో వ్యవసాయ అనుబంధ విద్యను ప్రోత్సహించేందుకు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు అత్యవసరం. ప్రస్తుతం, ఇక్కడి విద్యార్థులు వ్యవసాయ విద్య కోసం పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రకు వెళ్తున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇతర జిల్లాల్లో పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నప్పటికీ, నిర్మల్‌లో ఇంకా ఏర్పాటు కాలేదు. ముధోల్‌లోని 45 ఎకరాల పరిశోధన కేంద్రంలో రెండు ఎకరాల్లో కళాశాల నిర్మించి, మిగిలిన భూమిని పరిశోధనకు వినియోగించవచ్చు. ఇది స్థానిక విద్యార్థులకు వ్యవసాయ విద్యను అందుబాటులోకి తెస్తుంది.

కళాశాలతో లాభాలు

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటైతే, విద్యార్థులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు నేర్చుకుని, గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సలహాలు, సూచనలు అందించగలరు. ఇది పంటల పెంపకం, సస్య రక్షణలో నాణ్యతను పెంచుతుంది. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కూడా పె రుగుతాయి. ఈ కళాశాల ద్వారా శాస్త్రవేత్తలు, అ ధ్యాపకుల సంఖ్య పెరిగి, పరిశోధనలు మరింత ఊపందుకుంటాయి. ఇది జిల్లా వ్యవసాయ రంగాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేస్తుంది.

ప్రభుత్వం దృష్టి సారించాలి

ముధోల్ వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంపై స్పందించి, త్వరితగతిన కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. ఇది జిల్లా రైతులకు, విద్యార్థులకు శాశ్వత ప్రయోజనాలను అందిస్తుంది.

అక్రమ కేసు ఎత్తివేయాలి



నిర్మల్‌లో మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్/ఖానాపూర్/ముధోల్: జనంసాక్షి ఎడిటర్ రహమన్‌పై నమోదైన అక్రమ కేసు వెంటనే ఎత్తివేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు కొండూరు రవీందర్, ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్య డిమాండ్ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలు మండలం పెద్ద ధన్వాడలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు చేస్తున్న పోరాటాన్ని జనంసాక్షి పత్రికలో కథనాలు ప్రచురిస్తే జీర్ణించుకోలేని యాజమాన్యం తప్పుడు ఫిర్యాదుతో పోలీసులు ఎడిటర్‌పై కక్షపూరితంగా అక్రమ కేసు బనాయించడం సరికాదన్నారు. అక్రమ కేసు ఎత్తివేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు పోశెట్టి, అశోక్, యోగేశ్‌శర్మ, రాజ్‌కుమార్, కైలాష్, రాజేశ్వర్, మనోజ్, సుదర్శన్ పాల్గొన్నారు.

- ఖానాపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, సభ్యులు దేవేందర్, శంకర్, లక్ష్మణ్, సతీష్, ఫణీందర్, గంగాధర్ ఉన్నారు. ముధోల్ మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందించారు. సభ్యులు ప్రసాద్, సుభాష్, పవన్, గంగారెడ్డి, సునీల్, నాగేశ్, కిరణ్ పాల్గొన్నారు.

రోడ్లకు తాత్కాలిక మరమ్మతు చేపట్టండి

భైంసాటౌన్: వర్షాకాలంలో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా నియోజకవర్గంలోని రోడ్లకు తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని ఎమ్మెల్యే పి.రామారావుపటేల్ అన్నారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఇంజినీర్లతో మండలాలవారీగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు.

వారంలో జొన్నల డబ్బులు..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో జొన్నలు విక్రయించిన రైతులకు వారంలో డబ్బులు చెల్లిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈమేరకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మార్కెటింగ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు పెట్టుబడి ఖర్చుల కోసం ఈమేరకు ప్రభుత్వానికి విన్నవించినట్లు చెప్పారు. దీంతో వారంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందని వివరించారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



లక్ష్మణచాంద: మునిపెల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సరిత

ఖానాపూర్: రైతుల భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ సుజాత తెలిపారు. మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 19 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. సుర్జాపూర్‌లో 51 దరఖాస్తులు వచ్చాయని సీనియర్ అసిస్టెంట్ సబిత తెలిపారు. ఆర్ఐలు సత్యనారాయణ, నాగేష్, పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని గొడిసెరలో 33, లక్ష్మీపూర్‌లో 22 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ రైతుల రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీటీ రవీంధర్, ఎంఆర్ఐ వెంకటనర్సయ్య, సర్వేయర్ యోహాన్, రైతులు తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: రాయపూర్‌కాండ్లీ, బామ్నికే గ్రామాల్లో భూభారతి గ్రామసభలు నిర్వహించారు. వివిధ భూసమస్యలకు సంబంధించి 56 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ సర్ఫరాజ్ అమ్మద్ తెలిపారు. డెప్యూటీ తహసీల్దార్ రవీందర్, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నర్సాపూర్(జి): నసీరాబాద్‌లో 25, తురాటిలో 6 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. డీటీ వాహిదొద్దీన్, ఆర్ఐలు సుమలత, నవత జ్యోతి, జూనియర్ అసిస్టెంట్లు హేమలత, రాజలింగం, సిబ్బంది ఉన్నారు.

లక్ష్మణచాంద: మునిపెల్లిలో రైతుల నుంచి తహసీల్దార్ సరిత దరఖాస్తులు స్వీకరించారు. ఆర్ఐ నరేందర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

గాలివాన బీభత్సం

- నిర్మల్‌లో ఆటోపై కూలిన వృక్షం
- నలుగురికి గాయాలు..
- భైంసాలో పిడుగుపాటు



భారీ వృక్షం పడడంతో నుజ్జునుజ్జయిన ఆటో



చెట్టును తొలగిస్తున్న ఎస్సై, తదితరులు

నిర్మల్‌టౌన్/ఖానాపూర్/భైంసాటౌన్: జిల్లాలో సోమవారం సాయంత్రం పలు మండలాలు, పట్టణాల్లో ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. నిర్మల్ పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీ వృక్షం ఆటోపై కూలింది. దీంతో నాలుగురికి గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌కు చెందిన ఆటో డ్రైవర్ అజార్ కిరాయికి భైంసా వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో దిలావర్‌పూర్‌లో నలుగురు ప్యాసింజర్లను ఎక్కించుకున్నాడు. నిర్మల్‌లో దించే క్రమంలో ఈదురు గాలులు వీయడంతో పాత తహసీల్దార్ కార్యాలయం ప్రాంతంలోని భారీ వృక్షం ఆటోపై పడింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఆటోలోని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. జేసీబీ సహకారంతో భారీ వృక్షాన్ని తొలగించారు. ఖానాపూర్ పట్టణంతోపాటు మండల పరిధిలో రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పట్టణంలో పలుకాలనీల్లో బ్రేక్‌డౌన్ కారణంగా గంటలతరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలోని సత్తన్‌పల్లి నుంచి పెంబి వెళ్లే మార్గంలో సేవ్యానాయక్ తండా శివారులో ఫారెస్ట్ క్వాటర్స్ భారీ వృక్షం రోడ్డుపై పడిపోయింది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ గ్రామస్తులతో కలిసి చెట్టును తొలగింపజేశారు. భైంసా పట్టణంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ అధికారులు సరఫరా నిలిపేశారు. పిప్రికాలనీలో భారీ శబ్దంతో పిడుగు పడింది. దీంతో సమీపంలోని ఇళ్లలోని ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి.

మోదీ పాలన ఓ స్వర్ణయుగం

- బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధాని మోదీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలన ప్రజాసేవ పట్ల సంకల్పం, కృషి, అంకిత భావాలకు ఒక స్వర్ణయుగమని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ శాఖ ఆధ్వర్యంలో మోదీ 11 ఏళ్ల స్వపరిపాలన, కార్యకర్తలకు మవారం దిశా నిర్దేశం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో భారత్ అభివృద్ధి, స్వావలంబన వైపు వేగంగా పురోగమిస్తోందన్నారు. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కేంద్రం నుంచి వేల కోట్లతో నిర్మల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అర్జున్, పట్టణ అధ్యక్షులు కార్తీక్, సాయి, లింగం, ప్రసాద్, సత్యనారాయణ, రాకేశ్, గవస్కర్, రాజు, సంతోష్ పాల్గొన్నారు.

సోన్: ప్రధాని మోదీ 11 ఏళ్ల స్వపరిపాలన పూర్తి, శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదానం దినోత్సవం, యోగా దివాస్, ఎమర్జెన్సీ దివాస్ అంశాలపై మండల కేంద్రంలో సోమవారం కార్యశాల నిర్వహించారు. పార్టీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సాగర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాలు 15 రోజులపాటు అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్ తీవ్రవాదుల్ని మట్టుబెట్టిన భారత సైన్యానికి మండల శాఖ తరపున ధన్యవాద తీర్మానం తెలిపారు. అంతకుముందు మండల కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ గంగన్న, జిల్లా కౌన్సిల్ మెంబర్ నరేశ్, మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్, మండల ప్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షులు గంగయ్య, విజయ, నర్సయ్య, రాజేశ్వర్, సాయన్న, రాకేశ్, సత్యం, అమత్, రాజు, గణేశ్, నర్సయ్య పాల్గొన్నారు.

ఖానాపూర్: ప్రధాని మోదీ హయాంలో దేశం అభివృద్ధిలో పురోగతి సాధిస్తుందని బీజేపీ జిల్లా నాయకుడు జక్కుల సత్తయ్య యాదవ్ అన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో సోమవారం పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ప్రజాసేవ పట్ల సంకల్పం, కృషి, అంకిత భావాలకు ఒక స్వర్ణయుగంలా నిలిపిందన్నారు. నియోజకవర్గ కన్వీనర్ మహేందర్, నాయకులు సత్యవతి, సంతోష్, శ్రీనివాస్, అశోక్, అనిల్‌రావు, రాజేశ్వర్, సురేందర్, సాయి ఉన్నారు.

విద్యార్థికి సన్మానం



రవితేజను సన్మానిస్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్‌కు చెందిన ఏఈవో గణేశ్–సరస్వతి దంపతుల కుమారుడు రవితేజ ఇటీవల విడుదలైన ఐఐటీ ఫలితాల్లో ప్రతిభ కనబర్చాడు. హైదరాబాద్ ఘట్కేసర్ శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్స్, టెక్నాలజీ కళాశాలలో బీటెక్ పూర్తిచేశాడు. ఐఐటీ ఎంపిక కోసం గత ఫిబ్రవరి 2న ప్రవేశపరీక్ష నిర్వహించగా, గత మార్చి 17న విడుదలైన ఫలితాల్లో ఆలిండియాలో 638 ర్యాంకు సాధించాడు. సదరు విద్యార్థిని సోమవారం అందకూర్‌లో గ్రామస్తులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ అసోసియేషన్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సగ్గం గంగాధర్, ఆర్ఎంపీ వైద్యులు గణేశ్, అశోక్, గ్రామస్తులు కమలాకర్ ధర్మపురి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భైంసా ఆత్మ కమిటీ చైర్మన్‌గా వివేకానంద

భైంసాటౌన్: భైంసా ఆత్మ కమిటీ చైర్మన్‌గా కుభీర్‌కు చెందిన సిద్ధం వివేకానంద నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే 24 మంది సభ్యులను నియమిస్తూ జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి.

వాహనాల తనిఖీ

కుంటాల: మండలంలోని కల్లూరు 61 జాతీయ రహదారిపై ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీ ఆయన వెంట పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

హిందూ ధర్మపరిరక్షణకు పాటుపడాలి

నిర్మల్‌చైన్‌గేట్: హిందూ ధర్మపరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఛత్రపతి శివాజీసేవా సమితి జిల్లా అధ్యక్షుడు మేడిసమ్మ రాజు అన్నారు. ఛత్రపతి శివాజీ పట్టాభిషేక మహోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ మొగలాయుల దారుణాల్ని అరికట్టడానికి అనేక యుద్ధాలు చేశారన్నారు. హైందవ జాగృతికి, హిందూ సంప్రదాయ పరిరక్షణ కోసం శివాజీ ఎంతగానో కృషి చేశారన్నారు. దాదాపు 300కు పైగా యుద్ధాలు చేసి ఓటమి ఎరుగని వీరుడన్నారు. కార్యక్రమంలో నాయకులు అయ్యన్నగారి భూమయ్య, శంకర్‌రావు, మల్లికార్జునరెడ్డి, అంజుకుమార్‌రెడ్డి, నందకుమార్, దిగంబర్ రావు, రాజేశ్వర్ రెడ్డి, అలివేలు, జనార్ధన్, కమల్ నాయన్, సాయి, దశరత్ పోశెట్టి, నరేందర్, రజిని వైద్య, సుధాకర్, భూపతిరెడ్డి, రఘువీర్ పాటి, కపాల్, రాజేందర్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



తానూరు ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

తానూరు/నర్సాపూర్(జి): తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీల కార్యదర్శులు డిమాండ్ చేశారు. సోమవారం తానూరు ఎంపీడీవో నసిరొద్దీన్, నర్సాపూర్(జి) ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతిరెడ్డిలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీల నిర్వహణకు నెలనెల డబ్బులు విడుదల కావడం లేదన్నారు. సొంత డబ్బులతో ట్రాక్టర్‌లో డీజిల్ పోయాల్సి వస్తోందన్నారు. ప్రతినెల పంచాయతీలకు నిధులు కేటాయించాలన్నారు. ఉపాధి పనుల నుంచి తమను మినహాయించాలని కోరారు. కార్యదర్శులు తిరుపతిరెడ్డి, రవికుమార్, కార్యదర్శులు రాథోడ్ కైలాస్, నవనీత్ కుమార్, నరేశ్‌కుమార్, వెంకటేశ్, శివకుమార్, రాజు, కృష్ణ, సంధ్యారెడ్డి, సంస్కృతి శైలజ, గంగాజల ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీ స్వామి వివేకానంద విద్యానికేతన్ పాఠశాల 1998–99 బ్యాచ్ 9, 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. 27 ఏళ్ల తర్వాత విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు నరేందర్, దేవేందర్, ఉపాధ్యాయులు మనోహర్, రవీందర్, తిరుపతి, సంతోష్, శ్రీనివాస్, విఠల్, తుకారాం, సునంద, రాధ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో పరేషాన్

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో గత కొన్నిరోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో జనం పరేషాన్ అవుతున్నారు. వర్షం, గాలిదుమారం వస్తే ఇక అంతే సంగతి. రాత్రివేళ దోమలు, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం, పోస్టాఫీస్, మీసేవ కేంద్రాలకు వచ్చేవారు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే పట్టించుకుని విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

న్యాయం చేయాలని నిరసన

ముధోల్: మండల కేంద్రంలోని కోటగల్లీకి చెందిన మొసినొద్దీన్ తన భూమి విషయంలో న్యాయం చేయాలని కోరుతూ బాసర–భైంసా ప్రధాన రహదారిపై పడుకుని సోమవారం నిరసన చేపట్టాడు. బంధువులు, అన్నదమ్ముళ్లు తమ భూమిలో దున్ననీయడం లేదని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్సై బిట్ల పెర్సిస్ అక్కడికి చేరుకుని అతన్ని సముదాయించారు. రాతపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే న్యాయం జరిగేలా చూస్తానని చెప్పడంతో పోలీసు స్టేషన్‌కు వెళ్లాడు.

ఉచిత కంటి పరీక్షలు

ఖానాపూర్: పట్టణంలోని దేవి ఐ కేర్ కంటి ఆస్పత్రిలో సోమవారం 70 మందికి ఉచిత కంటి పరీక్షలు చేసినట్లు నేత్ర వైద్యసహాయకులు బోగ సాయి, నిఖిల్, ప్రదేశ్ తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న 70 మంది నుంచి 24 మందిని గుర్తించి ఉచిత కంటి శుక్లం ఆపరేషన్ కోసం రిఫర్ చేసినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి విజన్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో ఆపరేషన్ కోసం కరీంనగర్ లయన్స్ క్లబ్ రేకుర్తికంటి దవాఖానాకు తరలించారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

ఖానాపూర్: మండలంలోని బీర్నందికి చెందిన బీజేపీ మాజీ మండల ఉపాధ్యక్షుడు ఎనగందుల రవిపై కొందరు ఇటీవల చేసిన దాడిలో కాలి విరిగింది. బీజేపీ నాయకులు అజ్మీరా హరినాయక్, పడాల రాజశేఖర్ ఆధ్వర్యంలో రవిని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడ్డ వారిపై పోలీసులు వెంటనే హత్యాయత్నం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రకాశ్, లక్ష్మణ్, రమేశ్, రాముగౌడ్ ఉన్నారు.

టెండర్ కాపీ అందజేత

లోకేశ్వరం: రాజూరలో శ్రీరామాలయ నిర్మాణానికి గతంలో రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసిన టెండర్ ప్రపోజల్ కాపీని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సోమవారం గ్రామస్తులకు అందజేశారు. మాజీ ఎంపీపీ లలిత భోజన్న, మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు భూమన్న, చిన్నయ్య, దేవారెడ్డి, వినోద్ తదితరులు ఉన్నారు.

నేడు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామంలో మంగళవారం ఉదయం 8 నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏవో విక్రమ్, ఏఈవో హర్షిత ఓ ప్రకటనలో తెలిపారు. ముధోల్ వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు సాగుపై అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు. రైతులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

కొనసాగుతున్న బడిబాట

లక్ష్మణచాంద/సోన్/మామడ: బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. ఈనెల 6న ప్రారంభమై సోమవారం నాటికి నాలుగవ రోజూ చేరింది. లక్ష్మణచాంద మండల కేంద్రంతోపాటు తిర్పెల్లి, సోన్ మండలం కూచన్‌పల్లిలో ఉపాధ్యాయులు బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో పంపించాలన్నారు. సర్కారు బడుల్లో అందుతున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. గ్రామస్తులు వీడీసీ సభ్యులు ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థుల నమోదుకు సహకరించాలని కోరారు. మామడ మండలం గాయిద్‌పల్లి, తాండ్ర, పరిమండల్‌లో జిల్లా కేంద్రంలోని రాంనగర్ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగి పోషకులను కలిశారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. వీరిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జపాన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు తేజేంద్రసింగ్ భాటియా, కొండాజి శ్రీకాంత్, చందుల స్వామి, ఊరే శ్రీకాంత్, మనీషా, శేఖర్ చిరంజీవి, పావని, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.